4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం 26 జనవరి 2025
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# బయ్యారం ఉక్కు- తెలంగాణ హక్కు



డాక్టర్ అయాచితం శ్రీధర్
98498 93238

**విశాఖ ఉక్కు పరిశ్రమకు భారీ ప్యాకేజీని కేంద్రం ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో సుదీర్ఘకాలంగా నానుతున్న బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు మళ్లీ తెరమీదికి వచ్చింది. తెలంగాణకు న్యాయంగా, చట్టపరంగా సంక్రమించవలసిన బయ్యారం ఉక్కు పరిశ్రమను కేంద్రం గత ఎన్నికలకు ముందు గొయ్యి తీసి పాతేసింది. విభజన చట్టంలో కేంద్రం బయ్యారం ఉక్కు పరిశ్రమ ప్రకటించినప్పటికీ నాణ్యమైన ఇనుము కాదని, పరిశ్రమకు అవసరమైన స్థాయిలో నిల్వలు లేవని కుంటిసాకులు చెప్పి చేతులు దులుపుకొన్నది. రాష్ట్రంలో ఏడాదిగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లప్పగించి చూస్తున్నదే తప్ప బయ్యారం ఉక్కు పరిశ్రమ కోసం ఒక్క అడుగు ముందుకువేయలేదు. పరిశ్రమ ఏర్పాటు కోసం కేసీఆర్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను, కార్యాచరణను రేవంత్ ప్రభుత్వం అటకెక్కించింది. విశాఖకు ప్రకటించినట్టే బయ్యారానికి ప్యాకేజీ ప్రకటించడని రేవంత్ ప్రభుత్వం గొంతెత్తలేదు. కేంద్రాన్ని నిలదీయనూ లేదు. బీజేపీ తరఫున రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మరో ఆరుగురు లోక్‌సభ సభ్యులు ఉన్నప్పటికీ విశాఖ ప్యాకేజీ తరహాలో బయ్యారం ఉక్కు పరిశ్రమకు ప్యాకేజీ సాధించలేదు సరికదా సాధ్యం కాదంటూ చావుకబురు చల్లగా చెప్పారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కొలువుదీరిన బీజేపీ, కాంగ్రెస్ అధినేతలే ఈ వైఫల్యానికి బాధ్యత వహించాలి.**

అరవై ఏండ్ల కిందట విశాఖలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు తలపెట్టినప్పుడు లాభదాయకం కాదని హిందుస్థాన్ స్టీల్ నివేదిక ఇచ్చింది. ఆ పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకున్న ప్రాంతానికి అందుబాటులో ఇనుప ఖనిజాలు లేవు. ఉక్కు ఉత్పత్తికి అవసరమైన అనుబంధ ఖనిజాలు దరిదాపుల్లో లేవు. ఉన్నదల్లా ఒక్కటే. అది నౌకాశ్రయం. ఆ ఒక్క కారణంతో ఏకంగా విశాఖలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటైంది. రూర్కెల (ఒడిశా) భిలాయ్ (మధ్యప్రదేశ్) అసన్సోల్ (పశ్చిమబెంగాల్) బొకారో (ఛత్తీస్‌గఢ్) ఉక్కు పరిశ్రమలు ఏర్పా టు కావడానికి అక్కడి ఖనిజ రవాణా సానుకూలతలే కారణం. అదే క్రమంలో కొత్తగా ఏర్పాటుచేసే ఉక్కు పరిశ్రమకు అన్ని అవకాశాలున్న బైలాదిల్లా, గోవా, హోస్పేట్, సేలం, నైవేలి పోటీ పడినప్పటికీ అవకాశం దక్కించుకోవడంలో విశాఖ ముందు నిలిచింది. కార ణం నాటి సమైక్య రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి నీలం సంజీవరెడ్డి కార్యదక్షత, తెన్నేటి విశ్వనాథం, తమనంపల్లి అమృతరావు ప్రభృతుల నాయకత్వంలో జరిగిన విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు ఉద్యమం, 32 మంది అమరత్వం, ఆరేండ్ల పోరాట ఫలితంగా విశాఖ ఉక్కు పరిశ్రమ సాకారమైంది. ఈ నేపథ్యంలో సమైక్య రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం కూడా చేసింది. రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని బ్రహ్మానందరెడ్డి నాటి ప్రధాని ఇందిరమ్మను హెచ్చరించారు. ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. ఆ పౌరుషం నేడు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలంగాణ నేతలకు అణుమాత్రమైనా లేకపోవడం శోచనీయం.

> **మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ నేత కేసీఆర్ 2013లోనే బయ్యారం ఉక్కు అవసరాన్ని అవకాశాన్ని వివరిస్తూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు లేఖ ద్వారా విన్నవించారు. తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమకారులు 'బయ్యారం ఉక్కు- తెలంగాణ హక్కు' అంటూ నినదించారు.**

స్వరాష్ట్రం ఏర్పడినాక ముఖ్యమంత్రిగా కేసీఆర్, పరిశ్రమల మంత్రిగా కేటీఆర్ బయ్యారం ఉక్కు పరిశ్రమ కోసం విశ్వ ప్రయత్నం చేశారు. ప్రధాని మోదీకి, ఉక్కు శాఖ మంత్రులకు ఎప్పటికప్పుడు విన్నవించారు. 2015లో ముఖ్యమంత్రిగా కేసీఆర్, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న నాటి కేంద్ర కార్మిక మంత్రి దత్తాత్రేయ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పరిశ్రమ



ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. పార్లమెంట్ ఉభయసభల్లో టీఆర్ఎస్ పక్ష సభ్యులు బయ్యారం ఉక్కు కోసం గళమెత్తారు. వివిధ పార్టీలు, సంఘాల దీక్షలు ధర్నాలు ఊరేగింపులు సభలు జరిగాయి. మరోవైపు కేసీఆర్ ప్రభుత్వం వేగం పెంచడంతో అవసరమైన భూమి మౌలిక సౌకర్యాలు సంబంధించిన కార్యకలాపాలు ఊపందుకున్నాయి. అవసరమైతే రంగంలోకి దించడానికి సింగరేణి సంస్థను సమాయత్తం చేస్తూనే, పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్ నుంచి అవసరమైన ముడిసరుకు దిగుమతికి సర్రి పైప్‌లైన్ లేదా రైల్వే ట్రాక్ నిర్మాణం చేయడానికి కేసీఆర్ ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది.

బయ్యారం పెద్ద చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతూ ఇంకా అవసరమైతే సమీపంలోని కిన్నెరసాని గోదావరి జలాలను వాడుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. కేసీఆర్ ఎంతగా అర్థించినా ఆసక్తి ప్రదర్శించినా ఆర్థిక భారాన్ని మోయడానికి ముందుకు వచ్చినా కేంద్రం సహకరించలేదు. కమిటీల మీద కమిటీలు వేస్తూ, ఊరించే ప్రకటనలు చేస్తూ ఎనిమిదేండ్ల కాలయాపన చేసింది. చివరికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బయ్యారం ఉక్కు సాధ్యం కాదని చేతులెత్తేశారు. అనంతరం 2023లో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. 2018లో బైలదిల్లా గనులు అదానీ హస్తగతమైనప్పుడే, ఆ తర్వాత గుజరాత్ పశ్చిమ తీరం ముంద్రాలో అదానీ ఉక్కు పరిశ్రమకు శ్రీకారం చుట్టినప్పుడే బయ్యారం భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. విభజన చట్టంలో లేని తెలంగాణకు చెందిన ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసిన మోదీ ప్రభుత్వం, చట్టంలో ఉన్న బయ్యారం ఉక్కు పరిశ్రమను తెలంగాణకు దక్కకుండా అడ్డుపడింది. ముఖ్యమంత్రిగా కేసీఆర్ తొలి మంత్రివర్గంలో మంత్రులుగా బయ్యారం ఉక్కు పరిశ్రమకు శ్రుతి కలిపిన జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, 2014-19 మధ్య ఖమ్మం లోక్‌సభ సభ్యునిగా బయ్యారం ఉక్కు కోసం ఉద్యమించిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నేడూ మంత్రులే. బయ్యారంతో సామీప్య అనుబంధం ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, కొండా సురేఖ మంత్రులే. కానీ, ఒక్కరూ నోరు విప్పడం లేదు. కేంద్రంపై ఒంటి కాలు మీద లేచి ఉద్యమించాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదేమీ పట్టనట్టే వ్యవహరిస్తున్నారు. నమ్మి వారికి ఓట్లేసిన ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల ప్రజలు దారుణంగా మోసపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కీలకపాత్ర పోషించిన ఆ రెండు జిల్లాలే వంచనకు గురి కావడం విషాదం.

బయ్యారంలో లక్షన్నర ఎకరాల్లో రూ.16 లక్షల కోట్ల విలువైన ఇనుము సంపద ఉన్నదని ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ వెల్లడించింది. ఆ క్రమంలో 300 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్టు జియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా నిర్ధారించింది. వివిధ గనులు భూగర్భ పరిశోధన సంస్థలు ఏవీ కూడా కిషన్‌రెడ్డి లాగా బయ్యారం ఇనుము పనికిరాదని కొట్టిపారేయలేదు. నాణ్యమైన ఇనుము లభించని పక్షంలో పెల్లెట్లు (చిన్నపాటి ఇనుప గుండ్లు) పరిశ్రమ ఏర్పాటు చేయవచ్చునని మూడేండ్ల కిందటి నాటి కేంద్ర మంత్రి వీరేంద్ర సింగ్ స్వయంగా ప్రకటించారు. ఒకవేళ పరిశ్రమ ఏర్పాటుకు బయ్యారం ఇనుము సరిపోదనుకుంటే కేవలం 160 కిలోమీటర్ల దూరంలో ఛత్తీస్‌గఢ్‌లో బైలదిల్లా గనులు ఉన్నాయి. 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న విశాఖకు అవసరమైనంత ముడిసరుకు సమకూరుస్తున్న బైలదిల్లా బయ్యారానికి సమకూర్చలేదా అన్నదే ప్రశ్న. బయ్యారంలో ఇనుమే లేకపోతే, అది పనికిరాకపోతే సమీపంలోనే ఏపీ స్టీల్స్, స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ నవభారత్ ఫెర్రో అలాయ్, బేరియం కెమికల్స్ వంటి భారీ అనుబంధ పరిశ్రమలు దశాబ్దాల కిందటే ఎలా ఏర్పాటు అయినట్టు? ఉక్కు పరిశ్రమకు అత్యంత ఆవశ్యకమైన డోలమైట్ ఖనిజాన్ని బయ్యారం సమీపంలో ఉన్న మాదారం నుంచి 500 కిలోమీటర్ల దూరాన ఉన్న విశాఖకు రోజుకు 1,500 టన్నులు తరలించగలిగినప్పుడు, బైలదిల్లా ముడి ఇనుము బయ్యారానికి తరలించలేమా? ఎక్కడో 1800 కిలోమీటర్ల దూరంలో గుజరాత్‌లో ఏర్పాటైన అదానీ పరిశ్రమకు ముడిసరుకు సరఫరా చేయగలిగే బైలదిల్లా గనులు ఆ దూరంలో పదో వంతు కూడా లేని బయ్యారం ఉక్కు పరిశ్రమకు సరఫరా చేయలేవా? పైగా అత్యంత సమీపంలో గుండ్రాతి మడుగు, కొత్తగూడెం, ఇల్లందు, మహబూబాబాద్ రైల్వేస్టేషన్లు ఉండనే ఉన్నాయి. ప్రత్యేకించి మహబూబాబాద్ మీదుగా వెళ్లే రైల్వే లైన్ ఉత్తర, దక్షిణాలకు అనుసంధానంలా ఉన్నది. కొత్తగూడెం, వరంగల్‌లో విమానాశ్రయాలు, కొత్తగూడెం-కొవ్వూరు, కొత్తగూడెం-కిరండల్, రామగుండం-మణుగూరు, రైల్వే లైన్ల నిర్మాణానికి సంకల్పించిన కేంద్రం బయ్యారం ఉక్కు పరిశ్రమను మాత్రం పక్కన పెట్టిందంటే అక్కడి ఖనిజ సంపదను ఇతర రాష్ట్రాలకు తరలించి తెలంగాణ ప్రజల నోట మట్టిగొట్టే మాయోపాయం తప్ప వేరు కాదు.

> **బయ్యారంలో ఏం లేకపోతే సమైక్య రాష్ట్రంలో పదకొండేండ్ల కిందటి వరకు ఆయా ప్రభుత్వాలు ప్రైవేటు సంస్థలకు, విశాఖ ఉక్కు పరిశ్రమకు అప్పగించే ప్రయత్నాలు ఎందుకు చేసినట్టు? ముడిసరుకు లేకపోతే, లాభదాయకం కాకపోతే ప్రైవేట్ సంస్థలు బయ్యారం కోసం ఎందుకు ముందుకు వచ్చినట్టు? సమైక్య రాష్ట్రంలో బయ్యారం పరిసరాల్లోని 56 వేల హెక్టార్ల భూమి ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇవ్వడం, 4 లక్షల టన్నుల ముడి ఇనుము తవ్వి తరలించడం నిజం కాదా?**

బయ్యారం ఉక్కు పరిశ్రమ కిషన్‌రెడ్డి అన్నట్టుగా ఉత్త పరిశ్రమ కాదు. ముమ్మాటికీ ఉత్తమ పరిశ్రమ. ఉమ్మడి వరంగల్, ఖమ్మం ప్రజల చిరకాల వాంఛ. తెలంగాణ వరదాయిని. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో సైతం ఉద్యమించి స్వరాష్ట్రం సాధించుకున్న తెలంగాణ ప్రజలకు ప్రస్తుత పాలకుల నిష్క్రియాపరత్వం వల్ల బయ్యారం ఉక్కు పరిశ్రమను సాధించుకోవడం ఒక పెను సవాల్‌గా ముందు నిలిచింది. ఒక దశలో విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం చేయాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నించినప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ అడ్డుకున్నారు. 1960 దశకంలో జరిగిన విశాఖ ఉక్కు-ఆంధ్రా హక్కు ఉద్యమంలో తెలంగాణ బిడ్డలూ ప్రాణత్యాగం చేశారు. కనుక ఏపీ కూడా బయ్యారం పరిశ్రమకు మద్దతు తెలపాలి. తెలంగాణ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధినేతలు సైంధవ పాత్ర పోషించకుండా సహకరించాలి.

> **బయ్యారం ఉక్కు పరిశ్రమ కిషన్‌రెడ్డి అన్నట్టుగా ఉత్త పరిశ్రమ కాదు. ముమ్మాటికీ ఉత్తమ పరిశ్రమ. ఉమ్మడి వరంగల్, ఖమ్మం ప్రజల చిరకాల వాంఛ. తెలంగాణ వరదాయిని. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో సైతం ఉద్యమించి స్వరాష్ట్రం సాధించుకున్న తెలంగాణ ప్రజలకు ప్రస్తుత పాలకుల నిష్క్రియాపరత్వం వల్ల బయ్యారం ఉక్కు పరిశ్రమను సాధించుకోవడం ఒక పెను సవాల్‌గా ముందు నిలిచింది.**

# పథకాల అమలులో అమాత్యులు ఆగమాగం



డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్

**డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలైన రోజు నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల జారీ పథకాలను అమలు చేస్తున్నామని ధైర్యంగా చెప్పండంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీరా సమయం దగ్గరపడ్డాక చల్లబడ్డారు. ఈ నాలుగు పథకాలు లాంఛనంగా మాత్రమే మొదలుపెడతారంట. మండలానికో గ్రామాన్ని ఎంచుకొని, ఆ గ్రామంలో మాత్రమే ఇస్తారంట. ఆ ఊరిలో మాత్రం నూరు శాతం ఇస్తారంట!**

రాష్ట్రంలో 612 మండలాలున్నాయి. అంటే.. నేడు 612 గ్రామాలకే ఈ పథకాలు వర్తిస్తాయన్నమాట. ఆ తర్వాత 'టేక్ ఏ బ్రేక్' అన్నట్టుగా ఒక బ్రేక్ తీసుకుంటారు. ఉప ముఖ్యమంత్రేమో మార్చి లోపు అందరికీ ఇచ్చేస్తామని స్టేట్‌మెంట్ ఇచ్చారు. కానీ, ఆ తర్వాత మాట్లాడిన మంత్రులు ముగ్గురూ తలా ఓ మాట మాట్లాడారు. మంత్రి పొంగులేటి భట్టి మాటను పక్కనపెట్టి ఏ గ్రామంలో ఎప్పుడెప్పుడు ఈ పథకాలు అమలు చేస్తామో ఫిబ్రవరి మొదటి వారంలో షెడ్యూల్డ్ ప్రకటిస్తామన్నారు. దీంతో భట్టి మాట తుస్సుమ న్నది.

ఇక పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ ఇంకో నాలుగు ఆకులు ఎక్కువే చదివారు. ఇదంతా నిరంతర ప్రక్రియ అని తేల్చిపారేశారు. బహుశా 10, 15 రోజులకు ముందే జనవరి 26న మొత్తం రేషన్ కార్డులు ఇచ్చేసి ఇంట్లో ప్రతి వ్యక్తికీ 6 కిలోల బియ్యాన్ని ఇచ్చేస్తున్నామని చెప్పుకొచ్చిన మంత్రి అధికారిక ప్రకటన తేదీ వచ్చేసరికి తీరిగ్గా నిరంతర ప్రక్రియగా అని మాట మార్చారు. అంతేకాదు, రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ వంద శాతం పూర్తయిన తర్వాతనే 6 కిలోల నాణ్యమైన సన్నబియ్యం ఇస్తామని మరో మాట కూడా అనేశారు. ఈ నిరంతర ప్రక్రియ పూర్తయ్యేదెప్పుడు? వీళ్లు సన్నబియ్యం ఇచ్చేదెప్పుడు?

ఇక నాలుగో మంత్రి అయిన తుమ్మల నాగేశ్వరరావు రైతు భరోసా విషయంలో యాసంగిని హరామ్‌గా మింగేశారు. ఒక మంత్రి మార్చి, మరో మంత్రి ఫిబ్రవరి అంటే.. ఈ మంత్రి మాత్రం వచ్చే వ్యవసాయ సీజన్ కంటే ముందుగానే ఘనంగా రైతుభరోసా పంపిణీ పూర్తిచేస్తామని స్టేట్‌మెంట్ ఇచ్చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70 లక్షల మంది రైతులు యాసంగి అయిపోయినా సరే డబ్బులు పడుతాయేమో అప్పులన్నా తీర్చుకుందామని ఎదురుచూస్తున్నారు. ఇక మంత్రివర్యులేమో వచ్చే సీజన్‌కు అని యాసంగి పెట్టుబడి సాయాన్ని అమాంతంగా దిగమింగేశారు. గత యాసంగికి బీఆర్ఎస్ ప్రభుత్వం అట్టిపెట్టి ఉంచిన సొమ్ములను నాలుగైదు నెలల పాటు సాగదీసి, సాగదీసి వేశారు. తర్వాత రెండు సీజన్లను ఎగ్గొట్టారు. ఆ సొమ్ములను తీసుకొచ్చి రుణమాఫీలో కాఫీలో కలిపేసినట్టు కలిపేశారు. ఇప్పుడేమో మండలానికో గ్రామం చొప్పున వానకాలం సీజన్ వచ్చేదాకా పంచుతూనే ఉంటామని చెప్తున్నారు. అప్పటికి స్థానిక ఎన్నికల తంతు ముగుస్తుంది. ఆ తర్వాత ఈ సాయం ఇస్తారో, లేదో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంలేదు.



పథకాల అమలుకు ప్రభుత్వం ఎందుకింత ఆగమవుతున్నదో అర్థం కాని పరిస్థితి. పాలకులు మారారేమో కానీ, ప్రభుత్వ అధికారులు, శాఖ లు మాత్ర మారలేదు. గతంలో ఇవే పథకాలను సమర్థంగా అమలుచేసిన ప్రభుత్వాధికారులు ఇప్పుడెందుకు చేయలేకపోతున్నారు. ఇందుకు కారణం ఒక్కటే. ప్రస్తుత పాలకులకు తెలంగాణ సోయి లేకపోవడం, తెలంగాణ ఆత్మ తెలియకపోవడం, తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాల గురించిన అవగాహన లేకపోవడం. 'నేను లీడర్‌ను, నాకు తెలియాల్సిన అవసరం లేదు. తెలిసిన అధికారులు చుట్టూ ఉంటే చాలు. నేను పాలసీలు చేస్తా, వాళ్లు అమలుచేస్తారు' అని ఈ మధ్య నే సీఎం రేవంత్‌రెడ్డి అంతర్జాతీయ వేదిక దావోస్‌లో బహిరంగ స్టేట్‌మెంట్ ఇచ్చా రు. ముఖ్యమంత్రే ఈ మాట అన్న తర్వాత ఇక అధికారులు ఎలా వ్యవహరిస్తారో అర్థం చేసుకోవడం కష్టమేం కాదు. ప్రభుత్వ పథకాలు ఎలా అమలవుతాయో చెప్పనక్కర లేదు. రేవంత్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి పరిపాలన విషయంలో అనుసరిస్తున్న విధానాలే ఇందుకు ఉదాహరణ.

> **రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఘనంగా చెప్పుకొంటున్నా ఇప్పటికీ ఏ ఒక్క పథకాన్నీ నూటికి నూరు శాతం అమలుచేశామని చెప్పుకోలేని దుస్థితి. రుణమాఫీ మూడు దశల్లో అమలుచేసినా ఇంకా 30 శాతం మంది రైతులకు అమలు కాలేదని అధికార పార్టీ నేతలు చట్టసభల్లోనే చెప్తున్నారు. మంత్రులు కూడా గ్రామసభల్లోనూ ఇదే మాటను అంగీకరించారు.**

రూ.500కే గ్యాస్ పంపిణీ కానీ, 200 యూనిట్ల ఫ్రీ విద్యుత్తు పథకం పరిస్థితీ అంతే. ఒక ఊళ్లో అమలైతే మరో ఊళ్లో గుండు సున్నా. ప్రభుత్వం పూర్తిగా అమలుచేసింది ఏదైనా ఉన్నదా అంటే అది మహిళలకు ఉచిత బస్సు మాత్రమే. ఏ పథకంలోనైనా ఒక శాతం లోపం ఉండటం పెద్ద విషయం కాదు, ఆ లోపాన్ని సవరించి రైతుభరోసా ఇచ్చేస్తే సరిపోయేది. ఇందు కోసం మళ్లీ సర్వే మొదలుపెట్టారు. అందులో సాగుయోగ్యమైన భూమిని గుర్తించి ఇస్తారన్న మాట. దీంతో మళ్లీ అవినీతికి తెర లేపినట్టయింది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక రోజులో సర్వే మొత్తం చేయించి ఆన్‌లైన్‌లో రికార్డులను భద్రపరిచింది. కానీ, ఈ ప్రభుత్వానికి నమ్మకం లేక వచ్చీరాగానే ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించింది. గత పదేండ్లలో దఫ్తర్ ముఖం చూడని ప్రజలు మళ్లీ దఫ్తర్ మెట్లెక్కి దరఖాస్తులు నింపి ఇచ్చారు. అందులో రైతుభరోసా కూడా ఉన్నది. ఇందిరమ్మ ఇల్లు ఉన్నది. రేషన్ కార్డు ఉన్నదని వివరాలు తీసుకున్నారు. ఆ దరఖాస్తులు ఇప్పుడు యాడికిపోయాయో, ఎవరికీ తెలియదు. మళ్లీ ఈ నాలుగు పథకాల కోసం ప్రభుత్వం గ్రామసభల్లో కొత్త దరఖాస్తుల జాతర మొదలుపెట్టింది. కొత్తగా ఇప్పుడు ఈ నాలుగు పథకాలను అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్నట్టుగా తయారైంది. ఏదైతేనేమి బలవుతున్నది మాత్రం అభం శుభం తెలియని అమాయక ప్రజలే.

(వ్యాసకర్త: ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్)

# నయవంచక పాలనపై ప్రజా తిరుగుబాటు!



ఏనుగుల రాకేష్‌రెడ్డి

**ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే అంతిమ నిర్ణేతలు, వారి నిర్ణయమే అందరికీ శిరోధార్యం. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సబ్బండ వర్గాల పోరాట ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. వచ్చిన రాష్ట్రం తెచ్చిన నాయకుడి చేతిలోనే ఉండటమే సబబు అని నమ్మిన ప్రజలు వరుసగా రెండు పర్యాయాలు అధికారం అందించారు. పదేండ్ల పాలన తర్వాత సహజంగా వచ్చే వ్యతిరేకత, కాంగ్రెస్ పార్టీ అలవిగాని హామీల కారణంగా స్వల్ప తేడాతో అడ్డిమారి గుడ్డి దెబ్బలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు ఏర్పడాలంటే అది ప్రజా తీర్పుతోనే సాధ్యం అవుతుంది. ఎవరు అధికారంలో ఉండాలి, ఎవరు ప్రతిపక్షంలో ఉండాలన్నది ప్రజలే తమ ఓటు ద్వారా నిర్ణయిస్తారు. కానీ, నిండైన ప్రజాశీర్వాదంతో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ప్రజలది కాదని తమదే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం అన్నట్టు పోకళ్లకు పోయి ఇది ప్రజాపాలన అంటూ బ్రాండింగ్ చేసుకోవడం, పదే పదే ప్రజా పాలన అంటూ ఊదరగొడుతున్నారు. కానీ, నిజానికి ప్రజాపాలన అంటూ అత్యంత పైశాచిక పాలనకు తెరలేపడం ఎన్నో అంశాల్లో ఏడాదిగా చూస్తూనే ఉన్నాం. అందువల్లనే ఏడాది గడవకముందు నుంచే ప్రజలు ఈ ప్రజాపాలనపై తిరుగుబాటు చేస్తున్నారు. ఏడాది తర్వాత గ్రామాల్లోకి వచ్చిన అధికారులను ఎక్కడికక్కడ నిలదీస్తూ పట్టపగలే ప్రభుత్వానికి చుక్కలు చూపిస్తున్నారు. తమ భవిష్యత్తు ఏంటని నిలదీస్తున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల నుంచి అసెంబ్లీలో అడ్డదిడ్డంగా మాట్లాడి తప్పించుకోవచ్చు, ప్రతిపక్ష నాయకులు విసిరిన సవాళ్లను వక్రీకరిస్తూ తప్పించుకోవచ్చు, మీడియా నుంచి కూడా తప్పించుకోవచ్చు కానీ, అధికారం కట్టబెట్టి అందలమెక్కించిన ప్రజల నుంచి మాత్రం తప్పించుకోలేరని మరోసారి రుజువైంది. ఎందుకంటే ఐదేండ్ల వరకు గాలిలో దీపం లాంటి పదవి మళ్లీ రావాలంటే ఆ ప్రజల ముందే మళ్లీ నిలబడాల్సి వస్తుంది కాబట్టి ప్రజావాణిని వినక తప్పదు.

ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలకు వెళ్లి, మంత్రులు పక్క రాష్ట్రంలో ధర్నా కోసం ప్రత్యేక విమానంలో విహారయాత్రకు వెళ్లారు. అధికారులను మాత్రం ప్రజల దగ్గరికి పంపి 'మేం వచ్చాం మీకేం కావాలో మమ్మల్ని అడుక్కోండి' అన్నట్టు, అరకొర లబ్ధిదారుల పేర్లతో గ్రామసభలు పెట్టారు. స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులే కాంగ్రెస్ నాయకులు సూచించిన వారికే పథకాలు అందుతాయని ప్రకటిస్తున్నారు. ఈ రాజకీయ ప్రమేయం వల్ల అర్హులైన పేదలకు లబ్ధి జరగకుండా అన్యాయం జరిగే ప్రమాదం ఉన్నది. ఎలాగైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టెక్కాలన్న కుట్రలో భాగంగా ఖాళీ గిన్నెలతో విందు ఏర్పాటు చేసి ఊరిస్తున్నారు. అధికారుల నామమాత్రపు ప్రకటనలను, దాటవేసే ధోరణిని పసిగట్టిన ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అధికారులను నిలదీయడం అంటే అధికారంలో ఉన్నవాళ్లను, తాము అధికారం కట్టబెట్టిన ప్రభుత్వాన్ని వీధిలో గల్లాపట్టి అడిగినట్టే. ప్రభుత్వం మీద ప్రజలకు ఏ మాత్రం విశ్వాసం ఉన్నా సంయమనం పాటిస్తారు. కానీ, గుడ్డెద్దు పోయి చేనులో పడ్డట్టు చేసిన ప్రతీ పనిని నాలుగైదు సార్లు సమీక్షిస్తూ ఏ నిర్ణయం తీసుకోవాలో అర్థంకాక నాన్చుతున్న ఈ ప్రభుత్వ తీరుతెన్నులను ప్రజలు అర్థం చేసుకున్నారు. 'పని తక్కువ, పబ్లిసిటీ ఎక్కువ' అని గ్రహించారు. అందుకే అధికారులపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడుతున్నారు.



ప్రజలు ఎందరో నాయకులను ఎన్నుకున్నారు. ఎన్నో ప్రభుత్వాలను చూశారు. కాబట్టి, వాళ్లకు ఈ ప్రభుత్వ పనితీరు అంచనా వేయడం పెద్ద సమస్య కాదు. ప్రశ్నించడం అసలే కాదు. అందుకే, గ్రామసభల్లో ప్రజల కంటే పోలీసులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే ఎక్కువ ఉంటున్నారు. ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేసి గ్రామాల్లో ఘర్షణ వాతావరణాన్ని పెంచి పోషిస్తున్నారు. ప్రజలే అధికారులను, నాయకులను నిలదీస్తున్నారు. మరి కొన్ని చోట్ల కాంగ్రెస్ నాయకుల అరాచకాలను బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తే వాళ్లపై కాంగ్రెస్ నాయకులు భౌతికదాడులకు తెగబడుతున్నారు. పదేండ్లలో పచ్చగా, పాడి పంటలతో, పండుగలా వర్ధిల్లిన పల్లెల్లో రేవంత్‌రెడ్డి మళ్లీ కక్షలు, పగలు, ప్రతీకార రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారు.

పాలన చేతకాక పట్టణాల్లో హైడ్రా మంటలు పెట్టి, పల్లెల్లో గ్రామ సభలలో మంటలు పెడుతున్న రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. ఎందుకంటే, తెలంగాణ సమాజం చైతన్యానికి మారుపేరు. ఇక్కడి ప్రజల్లో త్యాగం, తెగించి కొట్లాడే తత్వం సహజంగా ఉంటది. కాబట్టి, రేవంత్ రెడ్డి మార్పు పేరుతో తెలంగాణలో పెట్టిన మంటలు చల్లార్చడానికి ప్రతీ ఒక్కరూ సన్నద్ధం అవ్వాలి. గతంలో ఈ రకంగా విర్రవీగిన ప్రభుత్వాలకు, నాయకులకు ప్రజలు ఏ విధంగా బుద్ధి చెప్పారో తెలుసు. అదే విధంగా రానున్న రోజుల్లో ఓటు అనే వజ్రాయుధంతో పోటు పొడవం ఖాయం, ఖాయం.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు)



> 'ఎవరో చెప్పారని, లేదా సంప్రదాయమని, లేదా నీకు నీవే ఊహించుకొని దేనినీ నమ్మొద్దు! చెప్పిన గురువు మీద గౌరవంతో విన్నదంతా నమ్మొద్దు! నీకు నువ్వే పరీక్షించి, విశ్లేషించుకుని అది మంచిదని, సమాజానికి మేలు చేస్తుందని బోధపడిన తర్వాతే దాన్ని స్వీకరించు, దాన్ని నీ పథంగా అందుకో !' అని రెండున్నర వేల సంవత్సరాల క్రితం బుద్ధుడు చెప్పాడు. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఎలా పరిగణించి ముందుకెళ్లాలో తెలియజెప్పడానికి ఈ మార్గాన్ని ఆయన సూచించాడు. దీనినే ప్రపంచవ్యాప్తంగా 'సైంటిఫిక్ టెంపర్' అనే భావనకు సమగ్రమైన నిర్వచనంగా పరిగణిస్తున్నారు.

# రాజ్యాంగంలో సైన్స్ స్ఫూర్తి

'సైంటిఫిక్ టెంపర్' అనే మాటను తొలుత వాడింది సిద్ధాంతకర్త కాదు, భాషావేత్త అసలే కాదు. జవహర్‌లాల్ నెహ్రూ 1946లో తన పుస్తకం 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో ఈ మాటను మొదటిసారి ఉపయోగించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ భావన మరింత గౌరవనీయమైన స్థానాన్ని ఆక్రమించింది. 1958లో సైన్స్ పాలసీ వచ్చినప్పటి నుంచి ఈ మాటను విరివిగా వాడటంతోపాటు సైన్స్- సమాజం మధ్యనున్న సంబంధ బాంధవ్యాలను బలోపేతం చేయడానికి కృషి పెరిగింది. 'సైన్స్ టెంపర్' అనే మాటను తెలుగులో 'సైన్స్ అభినివేశం' లేదా 'శాస్త్రీయ అభినివేశం' అని అనువాదం చేసుకోవచ్చు. ప్రశ్నించడం, పరిశీలించడం, పరీక్షించడం, ప్రతిపాదించడం, విశ్లేషించడం, సమాజానికి అనువర్తింప చేయడం, ఫలితాలను జాగ్రత్తగా పరిశీలించడం వంటివి ఈ కోవలోకి వస్తాయి.

ప్రపంచంలో భారతదేశమే తొలిసారి తన రాజ్యాంగంలో ఈ 'సైంటిఫిక్ టెంపర్' గురించి పేర్కొన్నది. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నియమాలని విధిగా గౌరవిస్తూ జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించాలని మొదలయ్యే ప్రాథమిక విధులు పౌరులకు ఉంటాయని ఆర్టికల్ 51 (ఏ) హెచ్ చెప్తుంది. ఇందులో ఎనిమిదవది అయిన హెచ్.. 'To develop the scientific temper, humanism and spirit of inquiry and reform' అని వివరిస్తున్నది. ఈ మాటలను జాగ్రత్తగా గమనిస్తే సైంటిఫిక్ టెంపర్‌తో పాటు మానవత, జిజ్ఞాస, సంస్కరణ అనే భావనలు కూడా కనబడతాయి. ఈ నాలుగింటిని కలగలిపి మన దృష్టి పథాన్ని రూపొందించుకోవాల్సింది ఉంటుంది. 1976లో 42వ రాజ్యాంగ సవరణ చేసినప్పుడు ఈ 'హెచ్' అధికరణం వచ్చి అంతర్భాగమైంది.

మరి భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాలకు ఎంత ఖర్చు పెడుతున్నదనే సందేహం రాకమానదు. జీడీపీలో 0.66 శాతమే భారతదేశం ఇం దుకు కేటాయించింది. నిజానికి ఒక శాతం చేస్తున్నట్టు రెండు దశాబ్దాలు గా మనం వింటున్నాం, కానీ వాస్తవరూపం ధరించలేదు. తమ తలసరి ఆదాయంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు 3.07, చైనా 2.4, దక్షిణ కొరి యా 4.5 శాతం చొప్పున ఖర్చు పెడుతున్నాయి. కనుకనే, ఆ మేరకు ఫలితాలు వస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మంచి పరిశోధనలు చేయ డం వల్లే పారిశ్రామికంగా ఆ దేశాలు లాభదాయకమైన స్థానంలో ఉండగలుగుతున్నాయి. ఉత్తమమైన మానవ వనరులున్న మన దేశం కనీసం ఒక శాతం ఖర్చు పెట్టగలిగితే అద్భుతమైన ఫలితాలు వస్తాయి.



డాక్టర్
నాగసూరి వేణుగోపాల్
94407 32392